

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(ప్రారంభం)

**నా పేరు సీత.** మా ఊళ్ళో ముగ్గురు సీతలున్నారు. అందరికంటే చిన్నదాన్ని నేనే. అందుకే నన్ను 'మూడో సీత' అనేవాళ్ళు. పెద్ద సీతకి ఆ మధ్యే పెళ్ళయిపోయింది. వాళ్ళ అమ్మా నాన్నా చూపించిన ఓ 'శఠగోపం'గాడ్ని నోరెత్తకుండా పెళ్ళి చేసుకుని 'పిచ్చిగొర్రె'లాగా వాడెనకాల వెళ్ళింది.

అప్పటికీ, "అదేమిటే పెద్ద సీతా, ఆ చీపురు పుల్లగాడ్ని నువ్వెలా పెళ్ళిచేసుకుంటావే?" అని దాని పెళ్ళి చూపులరోజునే అడిగా.

"ముందిక్కడ్నించి పోతావా పోవా? పిదపకాలం.. పిదపబుద్ధులూ!" అంటూ నా నెత్తిమీద ఓ మొట్టికాయ తగిలించింది వాళ్ళ నాయనమ్మ. ఆవిడో పూర్వ సువాసిని. నాకు కోపం ముంచుకొచ్చి, "ఏయ్..సిటీ పోలీసూ. నేనేమీ నీ మనవరాల్లాగా మూగమొద్దునికాను.. జాగర్త" అన్నా.

"ఏం చేస్తావే భడవా?" అంటూ కోపంగా నా వైపుకి పరిగెత్తుకొచ్చింది.

"ఈసారి మంగలి అనంతయ్యతో చెప్పి నీ గుండుకి గాటు పెట్టిస్తా!" అని ఇంకా దూరంగా పరిగెడుతూ అరిచా.

"నిన్నూ..నిన్నూ.." అంటూ ఆవిడ నా వెంటపడటం, నేను ఛెంగున గోడ గెంతేయడం, ఆవిడ బేలన్స్ తప్పి గోడకి గుద్దుకోవటం, తళతళలాడే మరచెంబులాంటి ఆవిడ గుండు మీంచి రక్తం 'ధార'కట్టడం ఒకేసారి జరిగినై.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, నేనెప్పుడూ కావాలని తప్పులు చెయ్యకపోయినా, వాటంతట అవే జరుగుతూ ఉంటై.

మా నాన్న నవ్వేసి ఊరుకునేవాడుగానీ, మా అమ్మ మాత్రం ఏ మాత్రం 'విచారణ' జరపకుండా నా వీపు విమానం మోత మోగించేది.

అందుకే, ఒక్క అన్నం తినేటప్పుడు తప్ప మిగతా సమయాల్లో నేను నాన్న కూచిని.

పెద్ద సీత పెళ్ళిచూపులనాడు జరిగిన గోలకి అది నాతో మాట్లాట్టం మానేసింది.

"నేను చాలా మంచిదాన్ని. నాతో ఎవరైనా సరే హాయిగా మాట్లాడొచ్చు!" అని దానికి వినిపించేట్టు నేను రెండు మూడుసార్లు అరిచినా, అది మాత్రం వినపడనట్టు 'యాక్టు' చేసింది. నాకేం?

మొత్తానికి పెద్ద సీత పెళ్ళి నేను చూడకుండానే జరిగిపోయింది. మా అమ్మా నాన్నా వెళ్ళారుగానీ, నన్ను మాత్రం తీసుకెళ్ళలా. అలకపాన్పు మీద ఆ 'శఠగోపం'గాడు అలిగాడనీ, నానా కోరికలూ కోరాడనీ తరవాత తెలిసింది. నేనే గనక అక్కడుంటే అవన్నీ సాగనిచ్చేదాన్నా?

ఇక రెండో సీత విషయానికొస్తే అది ఎస్సెల్సీ వరకూ చదివిందిగానీ ఉత్త పిచ్చిమొద్దు. ఎంతసేపూ 'యీ వోణీ మా బావ బొంబాయి నించి తెచ్చా'డనో, 'యీ గాజులు మా బాబాయి అమెరికానించి తెచ్చా'డనో గొప్పలు చెప్పుకోవడం తప్ప బుర్రలో మాత్రం 'గుజ్జు' లేదు. ఉత్తివాగుడు కాయ.

అవన్నీ మా వూరి సంతలో కొన్నవని మాకు తెలీదా? మొన్న ఓసారి వాళ్ళింటికి వెడితే, "ఒసే పిల్లముండా! మా చిన్నబావ యీ జడకుప్పెల్ని నాకోసం జబల్పూరు నించి తెప్పించాడు తెలుసా?" అని జడకుప్పెలు చూపించింది. మరి నాకు కోపం వచ్చిందంటే రాదా?

"అమ్మా సీతా.. నా బంగారు తల్లీ, మా బావ పంపిన జడకుప్పెలు చూసి పెట్టవా!" అని మర్యాదగా, లాలనగా అడిగితే ఎంత బాగుంటుంది! అలాక్కాక 'ఒసే పిల్లముండా' అంటే చిర్రెత్తదా? నేనూ ఊరుకోకుండా, "ఒసే పెద్దముండా.. మదార్ సాయిబు తమ్ముడి కొట్లో కొన్న జడకుప్పెలు జబల్పూరువంటే నమ్మడానికి నేనేమన్నా నీలాగా పప్పుసుద్దననిటే? అసలు జబల్పూరు ఎక్కడుందో అదైనా నీకు తెలుసా? జంతికలు కొనిపెట్టమంటేనే ఏడిచే మీ పీనాసి బావ, జడకుప్పెలు తెప్పిస్తాడటే? నీ గొప్పలు నా దగ్గర కావే భాడకావ్!" అని అందరూ వినేట్టు అరిచా.

అంతే..! వాళ్ళ నాన్న పడక్కుర్చీలోంచి గభాల్న లేచి కిందపడి, 'తిత్..తిత్..తిత్తిక్' అంటూ వింతగా అరిచాడు. కోపం వస్తే ఆయనకి నత్తి ఎక్కువౌతుంది.

రెండో సీత ముఖం 'ఎర్రగా' చేసుకుని బావురుమంది.

"ఆ ముళ్ళ కంపతో నీకెందుకే బుద్ధిలేనిదానా" అంటూ వాళ్ళమ్మ దాన్ని లోపలికి లాక్కెళ్ళి ధడాల్న నా మొహం మీదే తలుపు వేసేసింది.

నేను విజయగర్వంతో ఇంటికొచ్చా. ఓ గంట అయ్యాక 'కబురు' అందిందనుకుంటా.., "మళ్ళీ నోరుపారేసుకున్నావుట గదే రాస్కెల్" అంటూ నాకు 'తలంటి' మొదలెట్టింది మా అమ్మ.

తలంటి అంటే మీకు తెలీదుగా! తిట్ల పురాణాన్ని 'తలంటి' అనీ, చితగ్గొట్టటాన్ని 'తాషామర్పా' అనీ మా పల్లెటూళ్ళలో వాడతారు.

ఇంత జరిగిందా.! ఆ సీతే సాయంత్రం గుళ్ళో కనపడి, "సేవ్ సీతా, నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారే!" అంటూ సంభ్రమంగా చెప్పి, తెగ మురుసుకుంది. దాన్నేమనాలీ? అయినా,

"ఇప్పుడే పెళ్ళెందుకే, హాయిగా చదువుకోక?" అన్నాను పెద్ద ఆరిందాలా.

"పోవే! చదువుకుంటే ఏమొస్తుంది? పెళ్ళి చేసుకుంటే బోలెడు పట్టుచీరలూ నగలూ వస్తై!" అన్నది.

దీన్నెవడు బాగు చెయ్యగలడూ?

నా అల్లరి భరించలేక మా అమ్మ నన్ను తిట్టినా, మా నాన్నకి మాత్రం నేనంటే మహా ఇష్టం. ప్లీడరు సుబ్బారావ్ ఎం.ఎ.ఎల్.ఎల్.బి అనిపించుకునే కంటే 'ఆ గడుగ్గాయి సీత నాన్న' అనిపించుకోవడమే ఆయనకి ముద్దు. అదీ నిజమే.

మా వూరొచ్చి ప్లీడర్ సుబ్బారావుగారి ఇల్లెక్కడ అని ఎవర్నైనా అడగండి. కనీసం వాళ్ళు రెండు నిముషాలైనా ఆలోచిస్తారు.

అదే 'అల్లరిసీత' ఇల్లెక్కడని అడగండి.!.. క్షణంలో చూపిస్తారు. అదీ - మా వూళ్ళో నాకు వున్న పరపతి!

అసలు మా ఊరే వింతదైతే, మా వూరి పేరు ఇంకా వింతది. 'పెదపుల్లేటికుర్రు'. ఓ రచయితగారు చాలా చరిత్రగ్రంధాల్ని పరిశోధించి మా వూరికి ఆ పేరు ఎలా వచ్చిందో కనిపెట్టాడు కూడా.

ఓ పెద్దపులి మా ఊరికి దగ్గర్లో ఉన్న 'తమ్మిలేట్లో' నీళ్ళు తాగటానికి క్రమం తప్పకుండా వచ్చేదిట. ఆ సమయంలో మనుషులు కంటబడితే 'గుర్రు గుర్రు'మని బెదిరించేదే కానీ అపకారం చేసేది కాదుట. అందుకని మా వూర్ని 'పెద్దపులిగుర్రు' అనేవాళ్ళుట. కాలక్రమాన పాటలీపుత్రం పాట్నాగా మారినట్టు 'పెద్దపులిగుర్రు' కాస్తా 'పెదపుల్లేటికుర్రు'గా మారిందిట.

మా ఊరివారంతా యీ కథని మళ్ళీ మళ్ళీ చెప్పుకుని మహాగర్వంగా జబ్బలు చరుచుకుంటారు. కొందరైతే ఇంకా ముందుకెళ్ళి, "పులి తాగిన నీళ్ళు తాగిన వాళ్ళం, మాకు సాటొచ్చే మగాడు యీ జిల్లాలోనే లేడు!" అని గొప్పలు కూడా చెప్పుకుంటారు.

నేనయితే యీ కథని ఛస్తే నమ్మేదాన్నికాదు. ఎందుకంటే, పిల్లిని చూసినా భయపడే రకం మా జనాభాది. ఇహ పులి సంగతి చెప్పాలా?

ఒకటి మాత్రం నిజం. మా వాళ్ళు జబ్బలు చరచటంలోనూ డబ్బా కొట్టుకోవటంలోనూ 'పహిల్వాన్లే'గానీ, ఎవరికీ అపకారం చేసేవాళ్ళు కాదు. మిగతా వూళ్ళల్లోలాగా మా వూర్లో దొమ్ములూ దోపిడీలు ఉండేవి కాదు. అందుకే మా నాన్న ఎంత గొప్ప ప్లీడరైనా, ప్రాక్టీసు అంతంతమాత్రంగానే ఉండేది.

నేరాలు జరిగినప్పుడే కదా కోర్టులూ లాయర్లూ కళకళలాడేది. నేరాలే లేనప్పుడు విలవిలలేగా.

ఇంతకీ మా వూరు ఎలా వుంటుందో ఏమేం వున్నాయో గదూ! పచ్చని ఊరు. ఆకుపచ్చని రామచిలుకలా అందంగా మెరిసిపోతూ వుంటుంది. పెద్ద చెరువునిండా పద్మాలు.. చిన్న చెరువులో కలవపూలు.. చుట్టూ మామిడి తోటలా జీడిమామిడి తోటలూ ఓ శివాలయం, రాజరాజేశ్వరీ అమ్మవారు కొలువున్న ఓ ఆశ్రమం, ఊరిపొలిమేరల్లో అడవి ఆంజనేయస్వామి, ఓ హైస్కూలు, మేడబడి, రెండు మూడు ప్రయివేటు స్కూళ్ళు, ఓ ఆసుపత్రి, ఓ మేజిస్ట్రేటు కోర్టు, ఇక తాలుకాఫీసూ, పోస్టాఫీసూ ఇవన్నీ మామూలే. ముఖ్యంగా చెప్పుకోవలసినది లైబ్రరీ. చాలాచాలా పుస్తకాలున్నై. అయిదారుగురు 'ఆరెంపీ' డాక్టర్లున్నారు. సరుకులు కొంటే ఓ బెల్లం ముక్కో కొంచెం శనగపప్పో లంచంగా ఇచ్చే కిరాణాకొట్లు ఓ పది ఉన్నై. ఓ ముసల్మాను భూతవైద్యుడు కూడా ఉన్నాడు.

ఓ రెండుమైళ్ళు నడిస్తే తమ్మిలేరు కనిపిస్తుంది. ఎంత బాగుంటుందో! అడివి జాంకాయలూ, కరేపాకూ వాక్కాయిలూ అక్కడినించే కొట్టుకొచ్చేవాళ్ళం. మా హైస్కూలు ఆటస్థలంలో ఏభై ఏళ్ళకి పై బడ్డ బూరుగు చెట్టుకూడా ఉంది. చూడటానికి అన్ని వూళ్ళూ ఒకేలాగ కనపడినా, దేని ప్రత్యేకత దానిదే

ఆ రోజుల్లో సుందరాచారి 'కొలిమి' నన్ను బాగా ఆకర్షించేది. పలుగులూ, కొడవళ్ళూ నాగలి కర్రులూ ఇవన్నీ బహు నేర్పుగా అక్కడ తయారయ్యేవి. సుందరాచారి కొడుకు శేషాచారీ నేనూ ఒకే తరగతి. తండ్రి ఇనుముని ఎర్రగా కాల్చి పనిముట్లు చేస్తుంటే శేషాచారి ఇంతలావు 'సుత్తి'తో వాటిని కొడుతూ వుండటమో, లేక 'తిత్తి' ఆడించటమో చేస్తూ వుండేవాడు. కొలిమిలోంచి రవ్వలు రవ్వలుగా ఇనుపరజనూ, నిప్పూ ఎగురుతుంటే చూడ్డం భలే బావుండేది. ఓసారి నేనూ 'తిత్తి' ఆడిద్దామని ఉత్సాహపడితే, "అమ్మాయిగారమ్మాయిగారూ, మీరు బ్రేమ్మల పిల్లలు. ఇట్టా తిత్తి ఆడించారని తెలిస్తే నానోటికాడి కూడు పోద్ది. మీకు దండవెడతాగానీ, దూరంనించి చూడండి!" అన్నాడు.. రెండు చేతులూ ఎత్తి దండం పెడుతూ.

ఇదో పెద్ద చికాకైపోయింది. కుమ్మరి నరసింహులు ఇంటికెళ్ళి సారె తిప్పుతానన్నా ఇలాగే చేతులెత్తాడు.

వడ్రంగి నాగాచారి ఇంట్లో 'బాడితె' పట్టుకుని చెక్కుతానన్నా ఇదేగోల.

భ్రేమ్మల పిల్లట. భ్రేమ్మల పిల్ల.

తిక్కపుట్టి ఇదే విషయం మా నాన్నతో చెప్పాను. ఆయన ఒకటే నవ్వు! మా అమ్మ మాత్రం, "వాళ్ళింటికీ వీళ్ళింటికీ తిరుగుతావుటే భడవా? అంటూ సొంటూ ఉండఖ్ఖర్లా? ఇంకోసారి వాళ్ళిళ్ళకి పోతే కాళ్ళు విరగ్గొట్టి గదిలో కూచోబెడతా!" అంటూ ఇంతెత్తున లేచింది. ఈ పెద్దవాళ్ళందరూ ఇంతే. పిల్లల్ని కనడమేగానీ, వాళ్ళకీ చిన్నచిన్న సరదాలుంటై అని ఎందుకర్థం చేసుకోరో!?

అయిదోతరగతి కొచ్చేసరికి చట్టిముక్కు జోగారావూ, క్కిరుచెప్పుల మధూ, మెల్లకళ్ళ పార్వతీశం, ఇంకా డొంకాడ వెంకట్రావూ, మద్దిమత్తైన సుభాష్ బోసూ వీళ్ళందరూ పరిచయమై నా ప్రాణ స్నేహితులైపోయారు.

వీళ్ళతో కలిసి మావిడితోటల్లోనూ, అరటితోటల్లోనూ దొంగతనాలు చేసి మామిడి ముక్కలూ అరటి పళ్ళూ 'మెక్కటం' నేర్చుకున్నా.

తోటమాలిని 'బురిడీ' కొట్టించడంలో పార్వతీశంగాడు మహా నేర్పరి. జోగారావుగాడు గురిచూసి కొట్టాడంటే చిటారు కొమ్మ మీది కాయైనా ఠక్కున నేలమీద రాలాల్సిందే

వెంకట్రావూ, సుభాష్‌గాడూ కబడ్డీలో కింగులు. 'దొంగ' కూతపెడుతూ జనాన్ని ఎలా మాయ చెయ్యాలో పెర్ఫెక్టుగా నాకు నేర్పేశారు. అందుకే కూత ఆగినా, 'ఆగనట్టు' ఎలా నటించాలో బ్రహ్మాండగా నేర్చుకున్నాను.

కబాడీలో నన్ను పట్టడం ఎవడికీ సాధ్యమయ్యేదిగాదు. కాళ్ళకీ చేతులకీ నూనె పూసుకుని మరీ బరిలో దిగేదాన్ని. మామూలుగా తలకి నూనె రాసుకోడం నాకు చికాకు. అయితే 'ఆట' వుండే రోజుల్లో మాత్రం జుట్టుకి దిట్టంగా నూనె పట్టించి, ఆ నూనెనే కాళ్ళకీ చేతులకీ పూసుకునేదాన్ని.

పల్లెటూళ్ళల్లో ఏ విషయమైనా క్షణాల్లో అందరికీ తెలిసిపోయేది. నా విషయంలో అయితే మరీనూ! "మగపిల్లల్తో ఆటలేమిటే నీకూ? అసలు నీకు బుద్ధుందా?" అంటూ చెవులు వుడేటట్టు ఇంత పొడుగున నా చెవుల్ని సాగదీసేది మా అమ్మ.

అసలు.., ఆటలాడుకోవటానికి ఆడా మగా తేడాలేమిటీ? పోనీ, ఆడపిల్లల్తో ఆడుకుందామా అంటే వాళ్ళంతా తొక్కుడు బిళ్ళలూ, గచ్చకాయలూ, పులీ మేకా తప్ప మరొక ఆట ఆడరు. మహా అయితే తాటాకుల్తో బొమ్మలు చేసి వాటికి టైలరు సత్తిరాజుగాడి కొట్లోంచి తెచ్చిన గుడ్డపీలికల్తో బట్టలు కట్టి ముదినాపసానుల్లాగా బొమ్మల పెళ్ళిళ్ళు చేసేవారు. అంతేగాదు, 'మా అమ్మాయిని మీ బిడ్డలాగా బాగా చూసుకోండొదినా. కంటి పాపలా పెంచాం' అని పెద్ద వాళ్ళని అనుకరిస్తూ వెధవ ఏడుపులూ! అందుకే వాళ్ళతో కలవాలంటే నాకు మహా చిరాకు.

మా అమ్మ మహా స్ట్రిక్టు. ఆదివారమొస్తే ఆ పనీ యీ పనీ చెప్పి నన్ను కదల్నిచ్చేదికాదు. నేను ఎందుకు వూరుకుంటానూ? "నాన్నా.. మీ ఆవిడ నన్ను రాచి రంపాన పెడుతోంది. ఆదివారం కూడా ఆడుకోనివ్వదట. ఈవిడకి విడాకులిచ్చి మరో మంచి అమ్మని తీసుకురా!" అనేదాన్ని.

"ఏమన్నావే భడవా?" అంటూ మా అమ్మ నా మీదకి ఉరికి వచ్చినా, మా నాన్న మాత్రం," ఆదివారమన్నా ఆడుకోనివ్వకపోతే మరి దానికి కోపం రాదుటే? పోమ్మా.., నువ్వు ఆడుకో.! అయితే తొందరగా వచ్చెయ్!" అని నన్ను బయటికి పంపించేవాడు.

ఓ ఆదివారం నాడు మేమంతా చిన్న చెరువు దగ్గరికి పోయాం. కరణంగారి పాలేరు గేదెల్ని కడుగుతున్నాడు. నేను చెర్లో దిగి, వాడు చూడకుండా ఓ గేదె మీద కెక్కికూచున్నా. దాన్ని ఒడ్డు పట్టించడానికి రెండు కాళ్ళతో కాంతారావు గుర్రాన్ని తన్నినట్టు తన్నాను. అంతే! అది చరచరా బైటికొచ్చింది. కరణంగారి పాలేరు గుండెలు బాదుకుంటూ "అమ్మాయిగారూ.. మీకు దండం పెడతా దిగండి. లేకపోతే ఊళ్ళోవాళ్ళు నన్ను చంపేస్తారు." అంటూ ఏడుపు మొదలెట్టాడు. అది చూసి మా జోగారావుగాడు మహోత్సాహంగా దానితోక మెలిపెట్టాడు. అది పరుగులంకించుకుంది చూడు, అలా ఇలాగ్గాదు. వీరపరుగు.. నాకు చచ్చేంత భయంవేసింది.

దూకాలంటే భయం. అది ఎగురుతూ పరిగెడుతుంటే ఒణుకూ. రోడ్డుమీద వెళ్ళేవాళ్ళు ఆ గేదెనీ, ఆ గేదె మీద ఒణుకుతున్న నన్ను చూసి చచ్చేట్టు నవ్వుతూ ఈలల్తో కేకల్తో గేదెని ఇంకా బెదరగొట్టారు.

కొంతమంది పాపం ఆపాలని చూశారుగానీ అది ఆగలా. నాయనా.. అది మా ఇంటి ముందునించే పరిగెట్టటం.., మా అమ్మ నన్ను చూసి లబోదిబోమంటూ వెంటపడటం, అమ్మని చూసిన ఖంగారులో నేను గేదెమీంచి కిందకి దూకటం, ఆ దూకడంతో కుడికాలు బెణకడం క్షణాల్లో జరిగిపోయింది.

అమ్మ పెట్టే 'నాలుగూ' ఆ తరవాత పెడితే పెట్టిందిగానీ, నాకు 'గేదె స్వారీ' మాత్రం మహా నచ్చింది. ఆ తరవాత చాలాసార్లు గేదెలమీదెక్కి స్వారీ చేశా! అది వేరే విషయం అనుకోండి.

***

***వినాయకచవితి***

కొన్ని విషయాలు మీకు ముందే చెప్పాలి. ప్రస్తుతం నా వయసు ఎంతని అడక్కండి. నేను సీతనే గానీ అప్పటి గౌను వేసుకున్న సీతని కాదు. ఆ సీతలోకి యీ సీత 'స్వకాయ' ప్రవేశం చేసి రాస్తున్నదిది. పరకాయం అంటే ఇతరుల శరీరం. పరకాయం అంటే ఇతరుల శరీరం. 'స్వకాయం' అంటే నా శరీరంలోకి నేనే దూరాను. ఎలా? మనసులో దూరి, అప్పటి విషయాలన్నీ బైటికి లాగి మీకు వివరిస్తున్నానన్నమాట. ఇదేం డొంకతిరుగుడూ అంటారా? ప్రస్తుతం ఇట్లా మాట్లాడితేనే 'మేధావి' వర్గం గౌరవిస్తుంది. కానీ అప్పటి సీతకి మేధావుల్తో పనిలేదు. సరే! అప్పట్లో ఆడపిల్లంటే 'గుండెల మీద కుంపటిలాంటిది.' ఆవులకీ, గేదలకీ, కుక్కలకీ, పిల్లులకీ కూడా, ఆడపిల్ల మీద వున్నన్ని రిస్ట్రిక్షన్స్ వుండేవికాదు. ఆడపిల్లంటే అందరికీ జడవాల్సిందే కొన్ని కామెంట్లు చిత్తగించండి.

"నువ్వు ఆడపిల్లవి." (రోజుకో పదిసార్లైనా గుర్తు చేస్తారన్నమాట)

"ఆడపిల్లలు ఆడపిల్లలతోనే ఆడుకోవాలి!" (మరి మగాడ్ని ఎందుకు పెళ్ళి చేసుకున్నారో చెప్పరు)

"ఆడపిల్లగా పుట్టినందుకు కాస్త సిగ్గూ - శరం ఉండాలి!"

(సిగ్గు అంటే తెలుసు. మరి 'శరం' అంటే? బహుశా హిందీ 'షరమ్' శరం అయిందా?)

"ఏవిటా ఏకవికలూ పకపకలూ? నవ్వు నాలుగు విధాల చేటు!" (అంటే నవ్వడం కూడా వాళ్ళిష్టమే! గిన్నెలు దొర్లిపడ్డట్టు వాళ్ళు నవ్వొచ్చుకానీ, పెళ్ళికాని ఆడపిల్లలు నవ్వకూడదన్నమాట.)

"నవ్వే ఆడదాన్నీ ఏడిచే మొగాడ్నీ నమ్మకూడదు!" (అంటే ఆడది ఎప్పుడూ దిగాలుగా మొహం పెట్టుకుని ఏడుస్తూ ఉంటే నమ్మాలిగానీ, నవ్వితే నమ్మకూడదన్నమాట.. తస్మాత్ జాగ్రత్త!)

ఇవన్నీ మాట్లాడేది ఆడవాళ్ళే. అదేదో చైనాలో మావో సూక్తుల్లాగా ప్రతిరోజూ మా అమ్మ నోట్లోంచి యీ సూక్తులు వినక నాకు తప్పేదికాదు. వింటున్న కొద్దీ నాకు పంతం పెరిగి ఇంకా రెచ్చిపోయి ఇంకా జులాయిగా తిరిగేదాన్ని. "కుదరదూ.. ఇంట్లోనే ఆడుకో!" అనేది మా అమ్మ.

అమ్మకీ నాన్నకీ నేనొక్కత్తినే కూతుర్ని. ఒక్కత్తినే కూర్చుని ఏమాడుకుంటాను. ఆ మాత్రం ఆలోచన అమ్మలనే యీ 'ఘన'పదార్థాలకి ఎందుకుండదో!

***

వినాయకచవితి అంటే నాకు మహా ఇష్టం. చక్కగా ఓ గోని సంచీ బుజాన వేసుకుని, తెల్లారు ఝామునే నా ఫ్రెండ్స్‌తో బయల్దేరేదాన్ని. మొదట ఉప్పరిగూడెం మీదుగా భట్టువారి గూడెం చేరేవాళ్ళం. అక్కడ రోడ్డుపక్కనే ఓ పెద్ద వెలగచెట్టు, "రండి పిల్లలూ!.! హాయిగా కాయలు కోసుకోండి! పత్రి కావాలా! ఓకే.! అదీ రెడీ!" అని పిలుస్తున్నట్టుగా వుండేది.

చెట్లెక్కడం మహావిద్య ఏం కాదుగానీ, వెలగచెట్లూ, ములగ చెట్లూ ఎక్కడం మాత్రం చాలా చాలా కష్టం. అవి మహాపెళుసు. ‘టుపుక్కున‘ విరుగుతాయి. జాగ్రత్తగా లేకపోతే నడ్డిని  నారాయణుడు కూడా బాగుచెయ్యలేడు. ఆ రెండు చెట్లూ ఎక్కాలంటే మహానైపుణ్యం కావాలి.

మధూగాడు ఆ విషయంలో మహా ఎక్స్‌పర్టు. కోతిలా చులాగ్గా ఎక్కేసేవాడు. అయితే పెద్ద పెద్ద కాయలన్నీ మొదట వాడి సంచిలోనే వేసుకునేవాడు.

వాడ్ని ఏమార్చి క్షణాల్లో వాడి సంచిలో వుండే పెద్దకాయల్ని నా గోనె సంచిలోకి మార్చి పారేసేదాన్ని. ఇంటికెళ్ళాక అన్నీ చిన్నకాయలే వుంటే, ‘ఇదేంటని‘ వాడు రగిలిపోయి నాతోనే చెప్పుకునేవాడు.

వెలగపత్రీ కాయలూ కోశాక, బాలువారి గూడెంకి పోయేవాళ్ళం. మధ్యలో చిన్న చిన్న గుట్టలూ అవీ వుండేవనుకోండి. ఆ చుట్టుపక్కలే ఉమ్మెత్తపూలూ, గరికా ఉమ్మెత్తకాయలూ, రేక్కాయలూ, గన్నేరుపూలూ గోరింటపూలూ ఇంకా పేర్లు తెలియని రకరకాల పూలూ ఆకులూ కోసుకునేవాళ్ళం. పరిక్కాయలూ, రేక్కాయలూ, పులిచేరు పళ్ళు ఇవన్నీ దొరికితేచాలు, మా నోళ్ళల్లో పసందుగా నలిగేవి. యీ పూలూ పత్రీకోయటంలో కూడా గిల్లికకజ్జాలుండేవి.

సపోజ్.. ఓ ఆకు అందంగా కనిపించిందనుకోండి. కోసేదాన్ని.

"అదెందుకూ? అది వినాయకుడికి ఇష్టం వుండదు. దాన్ని పూజకి వాడకూడదు!" అనేవాడు పార్వతీశంగాడు.

"నీదుట్టి మట్టిబుర్ర! వినాయకుడికి అత్యంత ప్రీతిపాత్రమైన ఆకు ఇదే! యీ ఆకుల్తో పూజచేస్తే పెద్దయ్యాక కలెక్టరవడం గ్యారంటీ!" అనేదాన్ని.

భ్రమ్మల పిల్లనిగదా.! చచ్చినట్టు నమ్మేవాళ్ళు.

"ఒరే మధూ! సీతాఫలాలు గణపతికి చాలా ఇష్టం. అంతేకాదు. యీ రోజున ఎవరైతే ‘కళ్ళు బాగా విచ్చుకున్న ‘సీతాఫలాల్ని బ్రాహ్మణ బాలికలకి ఇస్తారో.. వాళ్ళకీ సంవత్సరం అంతా తిరుగుండదు. అష్టైశ్వర్యాలూ కలుగుతై!" అని గంభీరంగా అనేదాన్ని.

"దీన్ని నమ్మకురోరేయ్!. నోరు తెరిస్తే అన్నీ అబద్దాలే!" మధుగాడ్ని జోగారావుగాడు హెచ్చరించేవాడు.

"హూ.! కావాలంటే చెన్నావఝ్ఝుల శాస్త్రిగార్ని కనుక్కో. మొన్న ఆయన స్వయంగా ఎవరితోనో చెబితే నేను స్వయంగా విన్నాను. ఒరే మధూ ఇప్పుడా కళ్ళు విచ్చిన సీతాఫలాలు నాకిస్తే నువ్వెక్కడ గొప్పవాడివై పోతావో అని యీ జోగ్గాడికి కుళ్ళు. నీ ఇష్టం. వినాయకచవితి పూజకోసం సీతాఫలాల్ని ‘సీత‘ అనే పేరున్న బ్రాహ్మణ పిల్లకి ఇస్తే వచ్చే పుణ్యం అనంతం!" చాలా గంభీరంగా మొహం పెట్టి అనేదాన్ని. డౌటెందుకూ? బెస్ట్ సీతాఫలాలు వెంటనే వాడి గోనెలోంచి నా గోనెకి ఆటోమేటిగ్గా ట్రాన్స్‌ఫరైపోయేవి.

ఆ రోజుల్లో ఆరోడ్లన్నీ మట్టిరోడ్లు. ఎడ్ల బళ్ళు తిరిగేవి గనక రోడ్డుకి ‘గాళ్ళు‘ పడేవి. ఇహ పాములైతే.. ఓహ్.. లెక్కలేనన్ని. నాగుపాములూ, కట్లపాములూ, రక్తపింజరులు, నూనె పలుగుడు పాములూ, ఇంకా ఇంత పొడుగు బురదగొడ్లూ, జెర్రిగొడ్లూ, గోధుమ తాచులూ, చెట్లమీద కొమ్మమీద నించి ఇంకో కొమ్మ మీదకి ఎగిరే పసిరిక పాములూ ఓహ్.. ఎన్ని రకాలో.

రైతులకి కనబడినా వాటిని వదిలేసేవారేగానీ చంపేవాళ్ళుకాదు. ఇంటికి వచ్చిన పాముల్ని విడిచేవాళ్ళుకాదు. జనాల్లోకి వచ్చిందంటే చచ్చిందే. కొండ చిలవల్ని కూడా నేను చూశాను.

ఈ పత్రి సేకరణలో ఏదైనా పాము కనిపిస్తే వెంటనే దండం పెట్టేవాళ్ళం. నాగుపాము కనిపిస్తే పండగే! ఎందుకంటే, నాగుపాముకి దండం పెడితే చదవకపోయినా పరీక్షలు పాసైపోతామన్న గాఠి నమ్మకం. నాగుపామే కాదనుకోండి, ఏ పాముకి దండం పెట్టినా ఎంతో కొంత లాభం ఉంటుందికదా మరి.

తొమ్మిదింటికో తొమ్మిదిన్నరకో నకనకలా డుతూ ఇళ్ళకి చేరేవాళ్ళం. అంతకుముందు రోజే మేదరి కేశవరావు దగ్గర్నించి కొత్త విగ్రహం తెచ్చేసేవాళ్ళం. ఎంతా, పాలవెల్లి అణాన్నర, కుమ్మరి నరసింహులు అచ్చు పోసే మట్టి వినాయకుడి విగ్రహం బేడ. చిన్నదయితే అణా. కుదిరితే ఉపాధ్యాయుల వాళ్ళ తోటలో నేనూ నా స్నేహితులూ సామూహిక దొంగతనం చేసి అరిటిపళ్ళు కొట్టు కొచ్చేవాళ్ళం.

"ఒసే సీతా! నీ ఫ్రెండు మధూగాడ్ని ఒకసారి తీసుకురావే! వాడ్ని చూసి ఎన్నాళ్ళయిందో!" అని మా అమ్మ చవితికి ముందురోజు అనేది.

ఆవిడ అతిప్రేమకి అర్థం నాకు తెలుసు. మా కొబ్బరి చెట్టు ఎక్కించి కాయలు దింపించాలని ఆవిడ ప్లాను. మధూగాడు చెట్లు మహా హుషారుగా ఎక్కగలడని ఆవిడకి తెలుసు.

"వాడు చాలా పనిలో వున్నాడు. రాడేమో!" అని కావాలనే అనేదాన్ని.

"హూ! పెద్ద నీ ఫ్రెండంటావుగా! పిలిస్తే రాడూ?" ఆవిడ రెట్టించేది. ఏం చేస్తాం! పిలవగానే వాడొచ్చి, చకచకా చెట్టెక్కి కొబ్బరికాయలు దింపేవాడు. వాడికి నాలుక్కాయలిస్తే ఏంపాయే? ఉహూ! ఏ బెల్లం ముక్కో అరిశముక్కో చేతిలో పెట్టేదిగానీ కొబ్బరికాయలు మాత్రం ఛస్తే ఇచ్చేది కాదు. మహా పీనాసిది.

ఆ మాటే మా నాన్నతో చెప్పేదాన్ని. ఆయన నవ్వీ నవ్వీ, పదిసార్లు ఆ మాటే మా అమ్మకి వినబడేటట్టు మళ్ళీ మళ్ళీ చెప్పించుకునే వాడు. పదింటికల్లా పూజకి అన్నీరెడీ!

ఆ పండగలో నాకు నచ్చని ఏకైక అంశం తలంటు, ఇప్పుడైతే షాంపూలూ గీంపూలూ వున్నాయిగానీ, అప్పుడు కుంకుడు కాయలే గతి. కళ్ళల్లో ఒక్క చుక్క కుంకుడు రసం పడిందా - అంతే సంగతి. కళ్ళు ఎర్రబడి, నీళ్ళుకారుతూ మంటతో పిచ్చెక్కేది.

"కళ్ళకి మంచిదే వెర్రిమొహమా!" అని మా అమ్మ ఎన్ని సన్నాయి నొక్కులు నొక్కినా, మంట మనగ్గానీ ఆవిడకి కాదుగదా!

చచ్చీ చెడీ ఆ తలంటయ్యాక 'కొత్తగౌను' వేసుకునే అతి ముఖ్యమైన సందర్భం వచ్చేది.

అసలా 'గౌను' రెడీకావడానికి ఎన్ని కష్టాలో!

ఎప్పుడు నాకు కొత్త బట్టలు కొన్నా మా అమ్మమాటే సాగాలి. ఆవిడ తీరిగ్గా 'జల్లిపల్లి' వారి బట్టల దుకాణంలోనే బట్టల్ని 'ఎంపిక' చేసేది. ఆవిడ సెలక్టు చేసిన రంగులూ డిజైన్లూ నాకు చచ్చినా నచ్చేవికాదు. అలాగే నేను దేన్ని సెలక్టు చేసినా ఆవిడ ఆ 'తాను' మంచిదికాదనో 'మన్నిక' వుండదనో రిజక్టు చేసి నా నోరు మూయించేది.

మొత్తానికి ఇద్దరం రాజీకొచ్చి ఓ గుడ్డసెలక్టు చేసేసరికి గంటో గంటన్నరో పట్టేది.

అప్పట్లో 'రెడిమేడ్' దుస్తులు వుండేవి కాదు. ఉన్నా, మా వూళ్ళోకి అవి అప్పటికి అడుగు పెట్టలా.

వెంటనే ఆ గుడ్డని టైలరుకివ్వాలని నేనూ -

నాన్నగారికి చూపించాకే ఇస్తానని తనూ - గొడవపడేవాళ్ళం. ఇక్కడా ఆవిడే నెగ్గేది.

ఇక ఆ తరవాత టైలరు కివ్వడం మరో ప్రహసనం.

నలుగురైదుగురు దర్జీలున్నా ముక్కుపొడి పీల్చే వెంకట్రావుకే ఇవ్వాలని ఆవిడనేది. వెంకట్రావు కొట్టు కాస్త పెద్దదేగాక, "వెంకట్రావు ఎండ్ సన్స్.. ఫేషన్ టైలర్స్" అనే బోర్డూ, ఇక్కడ దుస్తులు అందంగా కుట్టబడును అని ఓ సబ్ టైటిలూ వుండేది. మిగతా వాళ్ళు ఎంత మంచి టైలర్లయినా వాళ్ళ షాపుకి బోర్డులు వుండేవి కావు. అదీ మా అమ్మ స్ట్రాటజీ.

ఆ వెంకట్రావు ఓ పట్టాన ఇచ్చేవాడుకాదు. రోజూ పదిసార్లు కుట్టావా లేదా? ఇస్తావా ఇవ్వవా? అని నేను వాడి ప్రాణాలు తినేసేదాన్ని. అతను తీరిగ్గా ముక్కుపొడి గాఢంగా పీల్చి.., "ఇస్తాళన్నాగా  అమ్మాయిగాళూ!. తొందళెందుకూ?" అని జలుబొచ్చిన వాడిలా ముక్కేవాడు. ఆ ముక్కుడు వింటే నాకు అరికాలి మంట నెత్తికెక్కేది.

అమ్మ సీతా! అరగంటలో కుట్టి ఇచ్చేస్తా సరేనా?" అంటే ఎంత మర్యాదగా ఉంటుందీ!

" అంత మాత్రం మర్యాద చూపిస్తే అసలు గొడవ రానేరాదుకదా.. ఏమనిన.."

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments